జులై మొదటివారానికి నారుమళ్లు పూర్తి చేసుకోవాలి

కాళ్ల: జులై మొదటివారం నాటికి నారుమళ్ల ప్రక్రియ పూర్తి చేసుకోవాలని వ్యవసాయ శాఖ జెడి జెడ్.వెంకటేశ్వరరావు అన్నారు. కాళ్లకూరు సొసైటీలో రైతు సలహా మండలి సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ జెడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ డ్రోన్ పైలెట్ శిక్షణ ప్రభుత్వం ఉచితంగా ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటోందన్నారు. ఇంటర్మీడియట్ పూర్తి చేసుకుని పాస్‌పోర్ట్ ఉన్న ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సీజన్ రాకముందే ఆర్‌బికెల్లో ఎరువులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. జిల్లా ఆక్వా సలహా మండలి సభ్యులు పెన్మెత్స దుర్గా ప్రసాదరాజు మాట్లాడుతూ ఇ ఫిష్ నమోదు పూర్తిస్థాయిలో చేయాలని కోరారు. ఇ-ఫిష్ నమోదు ప్రక్రియ అసంపూర్తిగా జరగడం వల్ల రైతులు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఆక్వా రైతులకు కూడా సబ్సిడీపై ఎరువులు అందజేయాలన్నారు. ఈ సమావేశంలో మండల రైతు సలహా మండలి ఛైర్మన్ రుద్దరాజు వెంకట రామకృష్ణంరాజు, ఎడిఎ శ్రీనివాస్, ఎఒ జయవాసుకి, మీసాల శ్రీనివాస్, కొల్లి రామకృష్ణ పాల్గొన్నారు.

పెట్టుబడి బారెడు.. ధర బెత్తెడు..!

వరికి మద్దతు ధర పెంపులో మోడీ సర్కార్ దగా
2023-24కు క్వింటాల్‌కు రూ.143 పెంపు
రైతుకు దక్కేది క్వింటాల్‌కు రూ.2,183 మాత్రమే
పెట్టుబడికి 50 శాతం కలిపితే ఇవ్వాల్సిన ధర రూ .2,707
ధరలో దగాతో అన్నదాతకు అప్పులే శరణ్యం
కేరళలో క్వింటాల్ ధాన్యంకు రూ.780 బోనస్.. మన రాష్ట్రంలో మాత్రం శూన్యం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన 2023-24కు సంబంధించి వరి పంటకు మద్దతు ధర పెంపుపై రైతులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పెట్టుబడికి.. మద్దతు ధరకు సంబంధం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేంద్రం ప్రకటించిన మద్దతు ధర రైతులకు ఏమాత్రం ప్రయోజనం చేకూరే విధంగా లేని పరిస్థితి నెలకొంది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ప్రధానమైన పంటల్లో వరికి అగ్రస్థానం ఉంది. ఖరీఫ్, రబీలో కలిపి పది లక్షలకుపైగా ఎకరాల్లో రైతులు వరి సాగు చేస్తున్నారు. ముఖ్యంగా డెల్టాలో వరి తప్ప రైతులకు వేరే ప్రత్యామ్నాయం సైతం లేని పరిస్థితి ఉంది. రైతులకు మద్దతు ధర అందించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దగా చేస్తుండటంతో ఏయేటికాయేడు అన్నదాత అప్పుల ఊబిలో కూరుకుపోతున్నాడు. ప్రతియేటా కేంద్ర ప్రభుత్వం ప్రకటించే మద్దతు ధర కంటితుడుపు చర్యగా మారాయని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 2023-24కు సంబంధించి వరికి క్వింటాల్‌కు రూ.143 పెంచుతున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. దీంతో మొన్నటి వరకూ క్వింటాల్ వరికి రూ.2040 ఉండే ధర ఇప్పుడు రూ.2,183కే చేరింది. స్వామినాథన్ కమిటీ సిఫార్సుల మేరకు పెట్టుబడి ఖర్చుకు అదనంగా 50 శాతం కలిపి మద్దతు ధర రైతులకు అందించాలి. ఆ విధంగా రైతులకు ధర అందాలంటే ప్రభుత్వం క్వింటాల్ వరికి రూ.2,707 ధర ఇవ్వాల్సి ఉంది. అయితే కేంద్రం ఆ విధంగా చేయకుండా తూతూమంత్రంగా ధర ప్రకటించింది. దీంతో రైతులు క్వింటాల్‌కు ధర రూపంలో రూ.524 నష్టపోతున్న పరిస్థితి నెలకొంది. కేంద్ర ప్రభుత్వం రైతుల గురించి ఏమాత్రం ఆలోచించడం లేదని, ప్రస్తుతం పంటలకు ప్రకటించిన ధరలను చూస్తే అర్థమవుతోంది. వాస్తవ ధరలను ఏమాత్రం పరిగణనలోకి తీసుకోకుండా తాము ప్రకటించిన ధరనే మద్దతు ధర అన్నట్లు కేంద్రం వాదిస్తున్న పరిస్థితి నెలకొంది.

ఎరువుల, పురుగు మందుల ధరలు పైపైకి

మోడీ అధికారంలోకొచ్చాక ఎరువులు, పురుగుమందులు, పెట్రోల్, డీజిల్ వంటి ధరలు ఆకాశాన్నంటాయి. దీంతో వ్యవసాయ పెట్టుబడులు పెద్దఎత్తున పెరిగిపోయాయి. ప్రస్తుతం 20-20-0 ఎరువు బస్తా ఖరీదు రూ.1700కు చేరగా, 28-28-0 ఎరువు ధర సైతం రూ.1700 పలుకుతోంది. 14-35-14, 10-26-26, పోటాస్ వంటి ధరలు సైతం బస్తా రూ.1700కు చేరాయి. డిఎపి బస్తా రూ.1350 వరకూ విక్రయిస్తున్నారు. డీజిల్ ధరల పెరుగుదలతో దుక్కుల ధరలు పెద్దఎత్తున పెరిగిపోయాయి. గతంలో సాలుకు రూ.600 ఉండగా ఇప్పుడు సాలుకు రూ.1200కుపైగా చేరింది. కిరాయి ధరలు గతంలో బస్తాకు రూ.పది ఉంటే ఇప్పుడు రూ.20 వరకూ వసూలు చేస్తున్న పరిస్థితి నెలకొంది. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా కూలి రేట్లు సైతం పెరిగాయి. దీంతో ఎకరా సాగుకు రబీలో దాదాపు రూ.49 వేలు వరకూ పెట్టుబడి ఖర్చవుతున్న పరిస్థితి నెలకొంది.

వరిసాగులో రైతుకు మిగులేది..?

ప్రస్తుత ధరల ప్రకారం ఎకరా వరిసాగుకు రూ.49 వేలు వరకూ ఖర్చవుతోంది. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ప్రకారం 75 కిలోల బస్తాకు రూ.1637గా ధర నిర్ణయం కానుంది. ఎకరాకు రబీలో సరాసరిన 45 బస్తాల దిగుబడి వస్తోంది. ప్రభుత్వం ప్రకటించిన ధర ప్రకారం రూ.73,665 ఆదాయం వస్తోంది. దీనిలో 15 బస్తాల కౌలు సొమ్ము రూ.24,555 భూయజమానికి చెల్లించాలి. ఇంకా పండిన పంటలో మిగిలే సొమ్ము రూ.49,110 మాత్రమే. పెట్టుబడికి వడ్డీ కలుపుకుంటే రైతుకు అప్పులే శరణ్యమన్నట్లు వరిసాగు తయారైంది. ఎకరాకు 40 బస్తాల దిగుబడి వస్తే భారీగా రైతులు నష్టపోవాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇదంతా ప్రభుత్వం ప్రకటించిన ధర వస్తేనే ప్రకృతి వైపరీత్యాలు, దళారుల వ్యవస్థ కారణంగా రైతులకు ప్రభుత్వం ప్రకటించిన ధర ఎక్కడా సవ్యంగా అందడం లేదు. దీంతో రైతు ఆరుగాలం కష్టపడినా వరిసాగులో మిగులనేది లేకుండాపోతుంది. వాస్తవ ఖర్చులను, క్షేత్రస్థాయిలో పరిస్థితులను ఏమాత్రం పరిగణనలోకి తీసుకోకుండా కేంద్రం మద్దతు ధరను తూతూమంత్రంగా పెంచేసి చేతులు దులుపుకుంటున్న పరిస్థితి నెలకొంది. కేంద్రం ప్రకటించిన ధరతో వరిరైతులు తీవ్రనష్టాల్లో కూరుకుపోవడంతో కేరళలోని వామపక్ష ప్రభుత్వం క్వింటాల్‌కు బోనస్‌గా రూ.780 ఇస్తోంది. మన రాష్ట్రంలో మాత్రం వరి రైతులకు బోనస్ అనేది లేకుండాపోవడంతో రైతుల అప్పుల ఊబిలో కూరుకుపోతున్న పరిస్థితి నెలకొంది.

ఉత్పత్తి ఖర్చులకు అనుగుణంగా ధర పెంపు లేదు

కె.శ్రీనివాస్, రైతుసంఘం జిల్లా కార్యదర్శి

కేంద్రం వరికి ప్రకటించిన ధర పెంపు ఉత్పత్తి ఖర్చులకు అనుగుణంగా లేకుండాపోయింది. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోనున్నారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ఆధారంగా మద్దతు ధర ప్రకటించాలి. వాస్తవ ఖర్చులను పరిగణనలోకి తీసుకోకుండా కేంద్రం ధర ప్రకటిస్తోంది. పురుగుమందులు, ఎరువులు, దుక్కుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. మద్దతు ధర గ్యారెంటీ చట్టం తెచ్చినప్పుడే రైతులకు మేలు జరుగుతుంది.

ఎకరాకు పెట్టుబడి ఖర్చు ఇలా	రూపాయల్లో..
1.ఆకుమడి, విత్తనాలు, ఎరువులు	1500.00
2.దుక్కుకి	3,600.00
3.లంకలు బాగుజేతకు	1,000.00
4.ఊడ్పులకు, ఆకుతీతకు	4,700.00
5.కలుపుమందుకు, చల్లినందుకు కూలి	1,200.00
6.కలుపుతీతకు, గడ్డికోతకు	1,000.00
7.ఎరువులు రెండు కోటాలకు	5,000.00
8.చిరుపొట్ట దశలో పొటాష్, గుళికలు	1,200.00
9.పురుగుమందులు నాలుగుసార్లకు	11,000.00
10.ఎలుకల నివారణకు	500.00
11.కోతమిషన్, ట్రాక్టరుకు	6,000.00
12.ధాన్యం ఆరబోతకు, పట్టుబడికి	2,000.00
సార్వాకు అయ్యే ఖర్చు మొత్తం :	రూ.38,700

దాళ్వాకు ఎరువులు, ఇతర ఖర్చులు అదనంగా మరో రూ.10 వేలు కలుపుకుంటే దాళ్వాసాగుకు అయ్యే ఖర్చు మొత్తం : రూ.48,700

మాట్లాడుతున్న ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు

దొరికితేనే దొంగలు..!

చించినాడ పెరుగులంకల మట్టిని మేడపాడు ఇటుక బట్టీలో అన్‌లోడ్ చేస్తుండగా పట్టుకున్న సిపిఎం కార్యకర్తలు
ముఖం చాటేసిన ఉన్నతాధికారులు

ప్రజాశక్తి - యలమంచిలి

మట్టి దొంగలు దొరికారు. అయితే మట్టి అక్రమ తరలింపు వెనుక ఉండి నడిపించిన ప్రభుత్వ పెద్దలు మాత్రం తేలు కుట్టిన దొంగల్లా ముఖం చాటేయగా.. వారితోపాటు జిల్లా ఉన్నతాధికారులు సైతం ఈ ఘటనతో కంగుతిని మౌనం వహించడం గమనార్హం. అసలు కథ ఏమిటీ.. ఏం జరిగిందని అనుకుంటున్నారా.. మండలంలోని చించినాడ, ఏనుగువానిలంక రెవెన్యూ పరిధిలో గోదావరి పెరుగులంక భూముల నుంచి అక్రమ మట్టి తవ్వకాలను నిరసిస్తూ పేదలు కొన్ని రోజులుగా వివిధ రూపాల్లో సిపిఎం ఆధ్వర్యాన ఆందోళన చేస్తున్న సంగతి తెలిసిందే. ఇటీవల ఆ ప్రాంతానికి చేరుకున్న ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడును బలవంతంగా పోలీసులు అరెస్టు చేసి, ఆపై సిపిఎం కార్యకర్తలు, పేదలు, దళితులు, మహిళలని చూడకుండా పోలీసులు విచక్షణారహితంగా లాఠీలు ఝుళిపించడం, పెద్దసంఖ్యలో పేదలు గాయాల పాలై ఆసుపత్రులు పాలైన సంగతి అందరికీ తెలిసిందే. ప్రభుత్వ భూముల్లో మట్టిన పేదల ఇళ్ల కోసం తరలిస్తుంటే తప్పేంటని కొంతమంది ప్రభుత్వ పెద్దలు ఆ రోజు మీడియా ముందుకొచ్చి ప్రకటనలిచ్చేశారు. అంతవరకూ బాగానే ఉంది. అయితే శుక్రవారం తెల్లవారుజామున చించినాడలోని పెరుగులంక నుంచి మట్టి లోడుతో లారీ బయల్దేరింది. దాని మార్గంపై అనుమానం వచ్చిన సిపిఎం కార్యకర్తలు దాన్ని వెంబడించారు. ఆ లారీ అదే మండలంలోని మేడపాడులో ఒక ఇటుక బట్టీలో అన్‌లోడ్ చేస్తుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. దీనిపై వారు వెంటనే ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడుకు, సిపిఎం జిల్లా నేతలకు సమాచారం అందించారు. ఎంఎల్ఎ రామానాయుడు, సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం అక్కడికి చేరుకుని మట్టి తరలింపు కాంట్రాక్టు తీసుకున్న మైత్రి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంపెనీకి సంబంధించిన గుమస్తాను, లారీ డ్రైవర్‌ను ప్రశ్నించగా నరసాపురానికి చెందిన ఒక వ్యక్తి ఒక్కో లారీ మట్టి రూ.10 వేలకు ఇక్కడికి తోలమని చెప్పారని, ఈ రోజు మూడు లారీలు మాత్రమే ఇక్కడ దింపామని ఇరువురు చెప్పారు. దీంతో అధికార పార్టీ ప్రజాప్రతినిధుల మట్టి వ్యాపారం బట్టబయలైంది. దొరికితేనే దొంగలు.. లేకపోతే దొరలు అన్నట్లు నిన్నటి వరకూ చించినాడ ఘటనపై రకరకాల ప్రకటనలు, భాష్యాలు చెప్పిన నేతలు శుక్రవారం ఉదయం నుంచి తేలు కుట్టిన దొంగల్లా కిమ్మనకుండా ఉండిపోయారు. ఈ క్రమంలో పాలకొల్లు రూరల్ సిఐ శ్రీనివాస్, ఎస్ఐ అక్కడికి చేరుకుని ఈ ఘటనపై విచారించి 24 గంటల్లో దోషులను అరెస్టు చేస్తామని చెప్పబోగా ఎంఎల్ఎ నిమ్మలతోపాటు సిపిఎం కార్యకర్తలు, నేతలు తీవ్ర అభ్యంతరం తెలిపారు. పోలీసు రక్షణతో లారీలను తిప్పుతూ ఇప్పుడు ప్రత్యక్షంగా దొరికేశాక ఇంకా దర్యాప్తు ఏమిటని, ప్రధాన దోషులు మీరేనంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక ఉన్నతాధికారులు సైతం ఈ ఘటనతో ముఖం చాటేశారు. దీంతో ఎంఎల్ఎ నిమ్మల, సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కవురు పెద్దిరాజు, నేతలు వారిని తీసుకుని నరసాపురం సబ్ కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్నారు. జరిగిన ఘటనను మొత్తం వివరించారు. పెరుగులంకలు తవ్వడం వల్ల గోదావరి ముంచుకొచ్చి పట్టాభూములు నీట మునుగుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన సబ్ కలెక్టర్ సూర్యతేజ మాట్లాడుతూ మట్టి తవ్వకాలను ఆపుతామని, తనకు కొంత సమయం ఇవ్వాలని కోరారు. అర్హులను గుర్తించి పట్టాలు సైతం ఇస్తామని హామీ ఇచ్చారు.

కక్షపూరిత వైఖరి వీడి.. హామీ అమలు చేయండి
సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం

రెండు నెలలుగా చించినాడలో పేదలు వివిధ రూపాల్లో ఆందోళన చేస్తున్నా పట్టించుకోకపోవడం దారుణమని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం ఆవేదన వ్యక్తం చేశారు. గత మంగళవారం పేదలు, దళితులు, మహిళలపై పోలీసులు విచక్షణారహితంగా లాఠీఛార్జీ చేయడమే కాకుండా ఆ తర్వాత మరింత దారుణంగా పెద్దసంఖ్యలో లారీలను పెట్టి మట్టిని తరలించారని అన్నారు. తాము ముందు నుంచి చెబుతున్నట్లే మట్టి అమ్ముకుంటున్నారనే దానికి శుక్రవారం మేడపాడు ఘటన ప్రత్యక్ష నిదర్శనమన్నారు. జగనన్న ఇళ్ల స్థలాలను మట్టితో పూడ్చడానికి తాము వ్యతిరేకం కాదని, అయితే దానికి పేదల అనుభవంలో ఉన్న భూముల్లో మట్టిని తవ్వడాన్ని తాము వ్యతిరేకిస్తున్నామని స్పష్టం చేశారు. ఇప్పటికైనా అధికారులు ఇచ్చిన హామీ మేరకు మట్టి తవ్వకాలు ఆపడంతోపాటు పేదలకు పట్టాలివ్వాలని కోరారు. అదే సమయంలో ఇప్పటి వరకూ తవ్విన మట్టి అమ్ముకున్న బకాసురులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. హామీలు అమలు చేయని పక్షంలో పేదల పోరాటం కొనసాగుతుందని, దానికి తాము పూర్తి అండగా నిలుస్తామని స్పష్టం చేశారు.

మట్టి అమ్ముకుంటున్న ముదునూరి, కవురు రాజీనామా చేయాలి
ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు డిమాండ్

జగనన్న కాలనీలకు పేరుతో ప్రయివేట్ వ్యక్తులకు మట్టిని అమ్ముకుంటున్న నరసాపురం ఎంఎల్ఎ ముదునూరి ప్రసాదరాజు, ఎంఎల్‌సి కవురు శ్రీనివాస్ వెంటనే తమ పదవులకు రాజీనామా చేయాలని పాలకొల్లు ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు డిమాండ్ చేశారు. మేడపాడులో ఎంఎల్ఎ రామానాయుడు మాట్లాడుతూ తాను ముందునుండి చెప్పినట్లుగానే చించినాడ పెరుగులంక భూముల నుంచి చీఫ్‌విప్, నరసాపురం ఎంఎల్ఎ ముదునూరి ప్రసాదరాజు, ఎంఎల్‌సి కవురు శ్రీనివాస్ జగనన్న కాలనీ పేరుతో వంద లారీలు బయటి వ్యక్తులకు అమ్ముకుంటూ 10 లారీలను మాత్రమే జగనన్న కాలనీలకు పంపుతున్నారని ఈ విధంగా బయటి వ్యక్తులకు మట్టిని ఒక్కో లారీ రూ.10 వేలకు, రోజుకు వంద లారీలు రూ.10 లక్షలు చొప్పున నెల రోజుల్లో రూ.మూడు కోట్లు ఇరువురు దోచుకున్నారనడానికి ఈ ఘటనే ప్రత్యక్ష నిదర్శనమన్నారు. ఎవరికైతే మట్టి తవ్వకాలకు అనుమతులిచ్చారో మైత్రి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంపెనీ సూపర్‌వైజర్ దగ్గరుండి మేడపాడులో తొమ్మిది లారీలు మట్టిని దింపుతూ ప్రత్యక్షంగా దొరకడమే దీనికి నిదర్శనమని, ప్రసాదరాజు, కవురు శ్రీనివాస్‌లకు ఏమాత్రం చిత్తశుద్ధి, నిజాయతీ ఉన్నా వెంటనే తమ పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే ప్రసాదరాజు, కవురు శ్రీనివాస్‌పై స్పీకర్ అనర్హత వేటు వేయాలని, అదేవిధంగా వారితోపాటు భాగస్వాములుగా ఉన్న జిల్లా కలెక్టర్, ఎస్‌పి, నరసాపురం డిఎస్‌పిలను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. మేడపాడులో పట్టుబడిన మట్టి లారీ వద్ద టిడిపి, సిపిఎం ఆధ్వర్యాన చేపట్టిన నిరసనకు జనసేన, సిపిఐ, ఫార్వర్డ్‌బ్లాక్, బిజెపితోపాటు మాలమహానాడు, మాదిగ దండోరా సంఘాలు మద్దతు ప్రకటించాయి. ఈ సందర్భంగా చించినాడలో దళితుల భూముల్లో వెంటనే మట్టి తవ్వకాలను నిలిపి వేయాలని, లేదంటే అఖిలపక్షం ఆధ్వర్యంలో చలో చించినాడకు పిలుపునిచ్చి న్యాయం జరిగే వరకూ పోరాడతామని ఉద్ఘాటించారు. కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్‌రావు, సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు, సిపిఎం నేతలు కవురు పెద్దిరాజు, జక్కంశెట్టి సత్యనారాయణ, బాతిరెడ్డి జార్జి, మండల కార్యదర్శి కానేటి బాలరాజు, నేతలు గొల్ల ఏడుకొండలు, వడ్డి కాసులు, టిడిపి నేతలు మామిడిశెట్టి పెద్దిరాజు, మాతా రత్నంరాజు, కొండేటి నరేష్, పీతల శ్రీనివాస్, జనసేన నాయకులు ఉన్నమట్ల ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మేడపాడులోమట్టిని దింపుతూ దొరికిన మట్టి లారీ ఇదే

మట్టి విక్రయంపై ఎంఎల్ఎ, ఎంఎల్‌సి సమాధానం చెప్పాలి
సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం

చించినాడ గ్రామంలో దళితుల తలలు పగలగొట్టి వారికి చెందిన భూముల నుండి దౌర్జన్యంగా మట్టిని బయటికి తరలించి ప్రయివేటు వ్యక్తులకు విక్రయిస్తుండటంపై నరసాపురం ఎంఎల్ఎ ముదునూరి ప్రసాదరాజు, ఎంఎల్‌సి కవురు శ్రీనివాస్ ప్రజలకు సమాధానం చెప్పాలని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం డిమాండ్ చేశారు. శుక్రవారం మేడపాడులో ఇటుకబట్టీకి మట్టిని విక్రయిస్తూ దొరికిన ఘటనా స్థలి వద్ద ఆయన మాట్లాడుతూ అన్యాయంగా దళితులకు సంబంధించిన పెరుగులంకలో మట్టిని తవ్వుతూ అడ్డువచ్చిన వారిపై పోలీసులచే లాఠీఛార్జీ చేయించి జగనన్న కాలనీల పేరు చెప్పి ప్రయివేట్ వ్యక్తులకు మట్టిని విక్రయించడం ఏమిటని ప్రశ్నించారు. దళితుల పొట్టకొట్టి రూ.కోట్లలో వ్యాపారం చేయడం బట్టి వైసిపి నాయకుల దుర్మార్గం ఏస్థాయిలో ఉందో అర్థమవుతుందని, దీనికి కారకులందరిపై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జెక్కశెట్టి సత్యనారాయణ, నాయకులు దేవ సుధాకర్, సరిపల్లె జయప్రభ, చెల్లిబోయిన వడ్డికాసులు, ఎం.ఆంజనేయులు, ఇంజేటి శ్రీనివాస్, శెట్టిమి భాస్కరరావు, మురాల రాజేష్, కోరం వెంకటేశ్వరరావు, ముస్కాడి జయశ్రీ, శెట్టిమి నాగమణి, మురాల ఝాన్సీ పాల్గొన్నారు.

నరసాపురం టౌన్: యలమంచిలి మండలం చించినాడలో పేద దళిత మహిళలపై ప్రభుత్వం, పోలీసుల దమనకాండను నిరసిస్తూ తెలుగు మహిళ, ఐద్వా ఆధ్వర్యంలో స్థానిక 22వ వార్డులో నిరసన నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ సభ్యురాలు, జిల్లా తెలుగు మహిళ అధ్యక్షురాలు డాక్టర్ సిరిగినీడి రాజ్యలక్ష్మి మాట్లాడుతూ మహిళలపై ప్రభుత్వ తీరు దారుణమన్నారు. ఐద్వా జిల్లా కార్యదర్శి పొగాకు పూర్ణ మాట్లాడుతూ కేసులు, అరెస్టులతో లంక భూముల పోరాటాన్ని ఆపలేరని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తిరుమణి శశిదేవి, బొర్రా చిన్నయమ్మ, భువనేశ్వరి కొరాడ పార్వతి, పొన్నాడ అన్నపూర్ణ, పాపాయమ్మ, భవాని తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు విరివిగా పంట రుణాలివ్వాలి

ప్రజాశక్తి - ఆచంట, యలమంచిలి, పెనుగొండ, అత్తిలి

ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన కౌలు రైతుల చట్టాన్ని సవరించి, కౌలురైతులకు విరివిగా పంట రుణాలివ్వాలని ఎపి రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.సూర్యనారాయణ, ఎపి కౌలురైతుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.బాలకృష్ణ కోరారు. ఆంధ్రప్రదేశ్ కౌలురైతుల సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన కౌలు రైతు రక్షణ జీపు యాత్ర శుక్రవారం జిల్లాలోకి యలమంచిలి మండలం చించినాడ వద్ద ప్రవేశించింది. ఈ సందర్భంగా జిల్లాలో యాత్రను సూర్యనారాయణ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం యాత్ర చించినాడ, యలమంచిలి, గుంపర్రు, కాంబొట్లపాలెం, వల్లూరు, ఆచంట, ములపర్రు, తామరాడచెరువు, పెనుగొండ, ఇరగవరం, కొత్తపాడు, జుత్తిగ, మంచిలి, అత్తిలి, పిప్పర మీదుగా రాత్రికి గణపవరం చేరుకుంది. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో నేతలు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలన్నీ భూయజమానులకే దక్కుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కౌలు గుర్తింపు కార్డుల కోసం భూయజమానులు సంతకం పెట్టడం లేదని, కౌలు రైతులకు భరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు. భూయజమాని సంతకం నిబంధన తొలగించి కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలని, పెట్టుబడి సాయం కింద రూ.25 వేలు ఇవ్వాలని, భూమిలేని కౌలు రైతులకు భరోసా కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వ విధానాలతో కౌలురైతులకు గుర్తింపు దక్కడం లేదని వాపోయారు. ప్రభుత్వం కౌలు రైతులకు సాగు రుణాలు ఇవ్వకపోవడంతో అధిక వడ్డీలకు అప్పు తెచ్చుకుని సాగు చేసి అప్పుల పాలై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కౌలు రైతుల కష్టాలు తీరాలంటే కౌలు రైతుల చట్టాన్ని పూర్తిగా మార్చాలన్నారు. కౌలు రైతుల సమస్యలపై ఈ నెల 12న విజయవాడలో జరిగే మహా పాదయాత్రలో కౌలు రైతులందరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కూసంపూడి సుబ్బరాజు, మామిడిశెట్టి రామాంజనేయులు, నాయకులు వద్దిపర్తి అంజిబాబు, సిర్రా నరసింహమూర్తి, పిల్లి ప్రసాద్ పాల్గొన్నారు.

కౌలురైతు రక్షణ యాత్రలో నేతలు

చించినాడలో జెండా ఊపి యాత్రను ప్రారంభిస్తున్న నేతలు

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలి

తణుకు రూరల్: ఉపాధి హామీ ఓ దండగ పథకం అని కించపరుస్తున్న మోడీ ప్రభుత్వాన్ని తరిమికొట్టాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బళ్ల చిన వీరభద్రరావు అన్నారు. ఇరగవరం మండలం రాపాకలో పనిచేస్తున్న ఉపాధి కూలీలను ఆయన శుక్రవారం కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఉపాధి హామీలో ఉన్న ఇబ్బందులను కూలీలు వీరభద్రరావు దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా వీరభద్రరావు మాట్లాడుతూ ఉపాధి హామీని దండగ మారిన పథకం అని మోడీ వ్యాఖ్యానించడం సరికాదన్నారు. రోజు కూలి 600 ఇవ్వాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కట్ట వెంకటలక్ష్మి, పితాని రమణ. వీరవల్లి వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

పెనుగొండ : దొంగరావిపాలెంలో ఉపాధి కూలీలకు వంద రోజులు కూడా పనులు కల్పించడం లేదని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు షేక్ పాదుషా డిమాండ్ చేశారు. శుక్రవారం ఉపాధి కూలీలతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కెవిపిఎస్ నాయకులు కప్పల.రత్నరాజు మాట్లాడుతూ బిజెపి ఉపాధి హామీని నీరుగారుస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో కుడిపూడి లక్ష్మీపూర్ణ, కూన నాగలక్ష్మి, బాలం హైమావతి పాల్గొన్నారు.

బాధితులకు అండగా అఖిలపక్షం

నోటీసులివ్వకుండా ఇళ్లు తొలగించడం అన్యాయం : జనసేన
గరగపర్రు రోడ్డులో రౌండ్ టేబుల్ సమావేశం

ప్రజాశక్తి - భీమవరం

పట్టణంలో గరగపర్రు రోడ్డు పక్కన ఇళ్లు కోల్పోయిన బాధితులకు అండగా ఉంటామని అఖిల పక్షం నాయకులు స్పష్టం చేశారు. బాధితులకు పూర్తి మద్దతు ప్రకటించి వారు చేస్తున్న ఆందోళనలో భాగస్వాములవుతామని హామీ ఇచ్చారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో పోరాట కమిటీ నాయకుల ఆధ్వర్యంలో శుక్రవారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జనసేన పట్టణ అధ్యక్షులు సిహెచ్ చంద్రశేఖర్ మాట్లాడుతూ 70 ఏళ్లుగా నివాసం ఉన్న దళితుల ఇళ్లను ఏ నోటీసూ ఇవ్వకుండా తొలగించడం అన్యాయమన్నారు. ఈ ఘటనను జనసేన తీవ్రంగా ఖండిస్తోందన్నారు. దళితులు అనేక ఏళ్ల నుంచి పైసాపైసా కూడబెట్టి ఇళ్లు నిర్మించుకుంటే దౌర్జన్యంగా వైసిపి ప్రభుత్వం మందీ మద బలంతో ఉదయం ఐదు గంటలకు వచ్చి సామగ్రి కూడా తీసుకోకుండా చేయడం దారుణమని వాపోయారు. టిడిపి నాయకులు ఐజాక్ బాబు మాట్లాడుతూ ప్రభుత్వం దళితులకు అండగా ఉంటామని చెప్పి వారి ఇళ్లను తొలగించడం సరికాదన్నారు. సిపిఐ ఏరియా కార్యదర్శి సిహెచ్ రంగ మాట్లాడుతూ ప్రభుత్వం దళితులకు ప్రత్యామ్నాయ స్థలాలు చూపకుండా అన్యాయంగా తొలగించడాన్ని ఖండించారు. బాధితులు చేస్తున్న పోరాటానికి సిపిఐ మద్దతు ఉంటుందని తెలిపారు. సిపిఎం పట్టణ కార్యదర్శి బి.వాసుదేవరావు మాట్లాడుతూ గరగపర్రు రోడ్డు పక్కన నివాసం ఉన్న పేదలు అనేక వృత్తులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారని చెప్పారు. వారిని టిడ్కో గృహాల్లో పెట్టడం వల్ల వారు జీవనోపాధి కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 60 మంది దళితులకు గత ప్రభుత్వం పట్టాలిచ్చి ఇల్లు నిర్మించారని, వాటిని దౌర్జన్యంగా ప్రభుత్వం కూల్చివేసిందని విమర్శించారు. ఇల్లు కోల్పోయిన లబ్ధిదారులకు వెంటనే రెండు సెంట్ల స్థలం ఇచ్చి ఇల్లు కోల్పోయిన లబ్ధిదారులకు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. తక్షణం సమస్యను పరిష్కరించాలని లేనిపక్షంలో అన్ని రాజకీయ పార్టీలనూ కలుపుకుని పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఫార్వర్డ్ బ్లాక్ నాయకులు డి.శ్రీనివాసరాజు మాట్లాడుతూ నష్టపోయిన దళితులను ప్రభుత్వం ఆదుకొని న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఇల్లు కోల్పోయిన లబ్ధిదారులు మార్తమ్మ మాట్లాడుతూ న్యాయం చేయాలని కలెక్టర్ కార్యాలయానికి వెళ్తే కలెక్టర్ ఇల్లు కోల్పోయిన వారికి న్యాయం చేయాలని మున్సిపల్ కమిషనర్‌కు ఆదేశాలు ఇచ్చారని, ఇంతవరకూ సమస్య పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో సిపిఎం నాయకులు త్రిమూర్తులు, ఆంజనేయులు, టిడిపి నాయకులు కె.శ్రీనివాస్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జనసేన పట్టణ అధ్యక్షులు చంద్రశేఖర్

టిడిపి మినీ మేనిఫెస్టోతో వైసిపిలో వణుకు

టిడిపి జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి

ప్రజాశక్తి - భీమవరం

టిడిపి విడుదల చేసిన మినీ మేనిఫెస్టో ట్రైలర్‌కు వైసిపి ప్రభుత్వంలో వణుకు పుట్టిందని టిడిపి జిల్లా అధ్యక్షులు తోట సీతారామలక్ష్మి తెలిపారు. టిడిపి భీమవరం నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం శుక్రవారం నిర్వహించారు. ముందుగా తోట సీతారామలక్ష్మి ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఇటీవల ఒరిస్సాలో జరిగిన ఘోర రైలు ప్రమాద మృతుల కుటుంబాలకు, పట్టణ 17వ వార్డు కమిటీ మాజీ అధ్యక్షుడు వేలివల సత్యనారాయణ మృతికి సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా సీతారామలక్ష్మి మినీ మేనిఫెస్టో కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. చంద్రబాబు మహానాడులో ప్రకటించిన మినీ మేనీఫెస్టో ట్రైలర్‌కు వైసిపిలో వణుకు మొదలైందన్నారు. మాజీ మంత్రి పీతల సుజాత మాట్లాడుతూ దళిత ద్రోహి జగన్ పరిపాలనలో దళితులు, వెనుకబడిన తరగతుల ప్రజలు అనేక కష్టాలు పడుతున్నారన్నారు. చంద్రబాబు ప్రకటించిన పథకాలతో రాష్ట్రం లోని మహిళలు, బడుగు బలహీన వర్గాల ప్రజలు సుఖ సంతోషాలతో ఉంటారని చెప్పారు. నియోజకవర్గ పరిశీలకుడు, రాష్ట్ర కార్యదర్శి దాసరి ఆంజనేయులు, రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి, రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ యువగళం పేరుతో నిరుద్యోగ యువతకు నెలకు రూ.3 వేల పెన్షన్ 20 లక్షల మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా రానున్న టిడిపి ప్రభుత్వం పని చేయనుందని తెలిపారు. రాష్ట్ర కార్యదర్శి వెంద్ర శ్రీనివాస్ మాట్లాడుతూ జగన్ దొంగ హామీలకు బిసిలు మోసపోరన్నారు. కార్యక్రమంలో వీరవాసరం మండల అధ్యక్షుడు కొల్లేపర శ్రీనివాస్, మండల అధ్యక్షుడు కార్యదర్శులు రేవు వెంకన్న, కౌరు పృథ్వీశంకర్, పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ఇందుకూరి సుబ్రహ్మణ్యరాజు, గూడూరి సుబ్బారావు పాల్గొన్నారు.

మేనిఫెస్టో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న టిడిపి నాయకులు

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ

ప్రజాశక్తి - పెనుమంట్ర

గర్భిణులు ఆడ పిల్లలకు మాత్రమే జన్మనివ్వాలని ఎందుకంటే, వారికే సహనం ఎక్కువని ఎంఎల్‌ఎ చెరుకువాడ శ్రీ రంగనాథరాజు అన్నారు. శుక్రవారం మార్టేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ (పిఎంఎస్‌ఎంఎ) కార్యక్రమంలో భాగంగా 100 మంది గర్భిణులకు పౌష్టికాహారం కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రంగనాథరాజు మాట్లాడుతూ మండలంలో అన్ని పంచాయతీలకూ ఏడాదికి రూ.50 లక్షల నిధులు వస్తే, ఐసిడిఎస్ ప్రాజెక్టు ద్వారా మండలానికి రూ.కోటికి పైగా పౌష్టికాహారాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. గర్భిణులు బలమైన పౌష్టికాహారం తీసుకొని ఆరోగ్య వంతులైన ఆడ పిల్లలను కనాలని అన్నారు. అనంతరం మేరీమాత విగ్రహాన్ని ఆవిష్కరించి గర్భిణులకు పౌష్టికాహారం అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి మట్టా కుమారి, ఉపసర్పంచి కర్రి వేణుబాబు, జెడ్‌పిటిసి కర్రి గౌరీ సుభాషిణి, ఎంపిటిసి కర్రి అనురాధ, గుడిమెట్ల లక్ష్మణరెడ్డి, నెగ్గిపూడి ఎంపిటిసి పెనుగొండ లక్ష్మి, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

పాలకొల్లు : వసుధ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పాలకొల్లు ప్రభుత్వాసుపత్రిలో శుక్రవారం ప్రధానమంత్రి మాతృత్వ యోజన ఆవాజ్ కార్యక్రమంలో భాగంగా 38 మంది గర్భిణులకు పౌష్టికాహారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభాకర్, వసుధ ఫౌండేషన్ కన్వీనర్ పి.బుద్ధరాజు, లయన్స్ క్లబ్ సీనియర్ మెంబర్ ఎన్‌ఎ.అన్నపూర్ణ తెలిపారు.

రాయితీపై విత్తనాలు అందజేత

ప్రజాశక్తి - పెనుమంట్ర

రైతు భరోసా కేంద్రం ద్వారా రైతులకు కావాల్సిన విత్తనాలను కిలో ఐదు రూపాయల రాయితీతో అందించడం జరుగుతుందని వ్యవసాయ సలహా మండల కమిటీ ఛైర్మన్ కొవ్వూరి రామకృష్ణా సూర్యనారాయణ రెడ్డి (చిన్నారెడ్డి) తెలిపారు. శుక్రవారం ఎంపిడిఒ కార్యాలయంలో స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం ఎఒ అడబాల జ్యోషి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా జ్యోషి మాట్లాడుతూ రాబోయే పది రోజుల్లో మట్టి నమూనాలు సేకరించాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రతి ఏడాదిలా ఈ ఏడాది కూడా 2910 మందికి కౌలు రైతుల కార్డులు అందించడం జరుగుతుందన్నారు. దాళ్వాలో ఇప్పటికే 35, 6090 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయగా రాబోయే రెండు రోజుల్లో 1200 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఇఒ ఎన్.సత్యనారాయణ, సిహెచ్ దుర్గాభవాని, వై.ఫణి, విఎఎలు పాల్గొన్నారు.

పంటల మద్దతు ధరలను పున:పరిశీలించాలి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

కేంద్ర ప్రభుత్వం తాజాగా ప్రకటించిన పలు పంటల మద్దతు ధరలు పెంచినది గోరంతగా వారు చెప్పే మాటలు కొండంతగా ఉన్నాయని అఖిలభారత అగ్రగామి కిసాన్ సభ రాష్ట్ర అధ్యక్షుడు లంక కృష్ణమూర్తి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో ప్రధానంగా పండించే వరి పంటకు సంబంధించి క్వింటాల్‌కు కేవలం 143 రూపాయలే పెంచారని, గత ఏడాది క్వింటాలకు రూ.వంద రూపాయల మాత్రమే పెంచారని తెలిపారు. ఎకరా వరిసాగు చేయాలంటే రైతుకు కనీసం రూ.50 వేలు ఖర్చవుతుందని తెలిపారు. అదే కౌలు రైతులు అయితే రూ.65 వేల నుంచి రూ.70 వేల వరకూ ఖర్చవుతోందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం మద్దతు ధరల పెంపుపై పున: పరిశీలించాలని కోరారు.

విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకోవాలి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

విద్యార్థులు తమ లక్ష్యాన్ని ఎంచుకునే సమయంలో తల్లిదండ్రులతో చర్చించి ఒక నిర్ణయం తీసుకుంటే మంచి ఫలితాలు వస్తాయని ఎస్‌ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ డాక్టర్ కెవి.మురళీకృష్ణమరాజు సూచించారు. ఇంటర్ పాసైన విద్యార్థులకు కెరీర్ గైడెన్స్, స్ట్రాటజిక్ ప్లానింగ్‌పై ఇసిఇ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో వర్క్‌షాప్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఇసిఇ హెడ్ డాక్టర్ ఎన్.ఉదయ్ కుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మురళీకృష్ణమరాజు మాట్లాడారు. విద్యార్థులు ఒక లక్ష్యాన్ని సాధించాలనే ఆలోచనలతో ముందుకు సాగినప్పుడే విజయాలను అందిపుచ్చుకోగలరన్నారు. ఇసిఇ హెడ్ డాక్టర్ ఎన్.ఉదయ్ కుమార్ మాట్లాడారు. ఇంజినీరింగ్‌లోని ప్రతి గ్రూపు సమాజానికి ఉపయోగపడే ఎన్నో అద్భుతాలు సృష్టిస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ కె.సతీష్ కుమార్, కెఎన్‌వి.సత్యనారాయణ, కనకరాజు, వైఎస్-ఎస్.శ్రీరామ్ పాల్గొన్నారు.

వరిసాగులో యంత్రాల వినియోగం పెంచుకోవాలి

ప్రజాశక్తి - ఆచంట

వ్యవసాయంలో యంత్రాల వినియోగం పెంచుకుని తద్వారా ఖర్చు తగ్గించుకుని అధిక దిగుబడులు సాధించాలని ఎంఎల్‌ఎ చెరుకువాడ శ్రీరంగనాథ రాజ తెలిపారు. శుక్రవారం పెనుమంచిలి గ్రామానికి చెందిన శివ సాయిరాం జెఎసి గ్రూపునకు రూ.15 లక్షల విలువైన 6 పవర్ టెల్లర్లతోపాటు గడ్డి చుట్టే యంత్రాన్ని రైతులకు ఎంఎల్‌ఎ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయాన్ని లాభ సాటిగా తీసుకొచ్చేందుకు ప్రభుత్వం సబ్సిడీపై అందించే యంత్రాలను రైతులు సద్వినియోగం చేసుకొని ఆర్థిక పరిపుష్టి పొందాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి గణేశుల శేషవాణి సుబ్బారావు, మార్కెట్ యార్డ్ వైస్ ఛైర్మన్ గుబ్బల వీరబ్రహ్మం, ఉపసర్పంచి బాబూరావు పాల్గొన్నారు.



బంగారయ్య దంపతులను సత్కరిస్తున్న సభ్యులు

బంగారయ్యకు సత్కారం

ప్రజాశక్తి - ఆకివీడు

రాష్ట్ర వినియోగదారుల సంఘాల సమాఖ్య ఉపాధ్యక్షులు, స్థానిక సర్ ఆర్థర్ కాటన్ వృద్ధుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు బొబ్బిలి బంగారయ్యను స్థానిక ప్రముఖులు, వృద్ధుల సంక్షేమ సంఘం సభ్యులు శుక్రవారం సత్కరించారు. ఆయన నివాసంలో బంగారయ్య 50వ వివాహ దినోత్సవం జరుపుకున్నారు. ఈ సందర్భంగా 50 సంవత్సరాల్లో ఆయన సాధించిన ప్రగతిని సమీక్షించారు. సహకార బ్యాంకు కార్యదర్శిగా, వినియోగదారుల సంఘం మండల కార్యదర్శి స్థాయి నుండి రాష్ట్ర ఉపాధ్యక్షులు స్థాయికి ఎదిగిన ఆయన అందించిన సేవలను పలువురు కొనియాడారు. వృద్ధుల సంక్షేమ సంఘం ఇక్కడ స్థాపించి ఎందరో వృద్ధులకు మార్గదర్శకంగా నిలిచారన్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో 175 అవార్డులు పొందిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. ఆయన సతీమణి నాగలక్ష్మి సహకరించడం పట్ల వారి ఇరువురిని అభినందించారు. కార్యక్రమంలో వృద్ధుల సంఘం గౌరవాధ్యక్షులు డాక్టర్ ఎంవి.సూర్యనారాయణరాజు, ప్రముఖులు మాట్లాడారు.

నరసాపురంలో ఫ్రైడే డ్రైడే

నరసాపురం టౌన్: ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నరసాపురం మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డుల్లో శుక్రవారం జరిగింది. ఇందులో భాగంగా మలేరియా, డెంగీ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించటం, దోమల నివారణకు మెలాతిన్, అబాట్ పిచికారీ చేయించటం, మురుగు నిల్వనున్న ప్రాంతంలో ఆయిల్ బాల్స్ వేయించారు. కార్యక్రమంలో ఎఎన్‌ఎంఎస్, శానిటేషన్ కార్యదర్శులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

పోడూరు ఎంపిడిఒగా సుహాసిని

పోడూరు: పోడూరు మండల ఎంపిడిఒగా డి.సుహాసిని శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆమె తూర్పుపాలెంలోని క్యాంపు కార్యాలయంలో ఎంఎల్‌ఎ చెరుకువాడ శ్రీరంగనాథ రాజును మర్యాదపూర్వకంగా కలిశారు. ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలంలో ఇఒపిఆర్‌డిగా పనిచేస్తూ డి.సుహాసిని ప్రమోషన్‌పై పోడూరు మండలానికి బదిలీ వచ్చారు. ఇప్పటివరకూ పోడూరు మండల ఇఒపిఆర్‌డిగా ఉన్న ఎం.బలరామరాజు పోడూరు మండల ఇన్‌ఛార్జి ఎంపిడిఒగా బాధ్యతలు నిర్వహించారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎంపిడిఒ సుహాసినికి జెడ్‌పిటిసి గుంటూరి పెద్దిరాజు, ఎంపిపి సబ్బితి సుమంగళి సాగర్, ఎపి సీడ్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ రామచంద్రరావు అభినందనలు తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

విద్యార్థుల బంగారు భవిష్యత్తే జిఎంఆర్ లక్ష్యం

కళాశాల ఛైర్మన్ గ్రంధి సత్యనారాయణ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు జిఎంఆర్ డిగ్రీ కళాశాల మంచి అవకాశాలు అందిస్తోందని కళాశాల ఛైర్మన్ గ్రంధి సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. 1998వ సంవత్సరంలో శ్రీ గాయత్రీ ఎడ్యుకేషనల్ సొసైటీని స్థాపించినట్లు తెలిపారు. తరువాత శ్రీవాసవి గ్రంధి మాణిక్యాలరావు జూనియర్ డిగ్రీ కళాశాలను ప్రారంభించినట్లు తెలిపారు. అలాగే 2002లో ఇంటర్, 2007లో బిఇడి కాలేజీ, 2012లో డిఇడి కాలేజీని ప్రారంభించినట్లు తెలిపారు. నేటికి జిఎంఆర్ కళాశాల 25 సంవత్సరాలు విజయవంతంగా పూర్తి చేసుకుని సిల్వర్ జూబ్లీలో ప్రవేశించినట్లు తెలిపారు. సంస్థ నాటి నుంచి నేటి వరకూ తాడేపల్లిగూడెంలో విజయవంతంగా నడుస్తోందన్నారు. తమ విద్యార్థులు ఇన్ఫోసిస్, విప్రో, టిసిఎస్, ఇన్ఫోటెక్, అమెజాన్ వాటి కంపెనీల్లో ఉద్యోగాలు సాధించారని తెలిపారు. ఆంధ్రా యూనివర్సిటీ పరిధిలోని 2012, 2013 సంవత్సరంలో తమ విద్యార్థులు బిఎస్‌సి టాపర్, నాల్గో స్థానాన్ని సాధించారు. కళాశాల నిరంతరం సిసి కెమెరాల పర్యవేక్షణలో ఉంటుందన్నారు. విశేష అనుభవం గల అధ్యాపకుల బృందం, విశాలమైన తరగతి గదులు, సొంత మినరల్ వాటర్ ప్లాంట్, ఇంటర్నెట్ సౌకర్యాలు కలవని తెలిపారు. విద్యార్థులకు ప్రత్యేక డైనింగ్ హాల్, మార్కులు, హాజరు ఎస్‌ఎంఎస్ ద్వారా ప్రతిరోజూ విద్యార్థుల తల్లిదండ్రులకు పంపిస్తున్నట్లు తెలిపారు. ఇంటర్మీడియట్, డిగ్రీ అడ్మిషన్లు జరుగుతున్నాయని, గ్రామీణ ప్రాంతాలకు బస్ సౌకర్యం ఉందని కళాశాల ఛైర్మన్ గ్రంధి సత్యనారాయణ తెలిపారు.

గ్రంధి మాణిక్యాలరావు డిగ్రీ కళాశాల

హామీల అమలే వైసిపి లక్ష్యం : ఎంఎల్‌ఎ గ్రంధి

ప్రజాశక్తి - వీరవాసరం

చెప్పింది చేసి చూపించడమే వైసిపి ప్రభుత్వం లక్ష్యంగా పని చేస్తోందని ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. బాలేపల్లి గ్రామంలో గడపగడపకూ నిధులు రూ.11.50 లక్షలతో అభివృద్ధి చేసిన మూడు సీసీ రోడ్లను ఎంఎల్‌ఎ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన దృష్టికి స్థానికులు తీసుకొచ్చిన సమస్యలను పరిష్కరించాలంటూ అధికారులను ఆదేశించారు. తాగునీటి చెరువుకు వెళుతున్న బోదెలోకి పలువురు పైపులు పెట్టారని తెలపడంతో వారి పేర్లు నమోదు చేసి డ్రెయిన్ పైపులు తొలగించకపోతే వారి కరంటు, నీటి కుళాయిలను తొలగించాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. ఇటీవల కొద్దిరోజుల క్రితం తన గడ్డిమేటు తగలబడిపోయిందని ఎవరో ఉద్దేశపూర్వకంగానే తగులబెట్టారంటూ మహిళల ఎంఎల్‌ఎ వద్ద వాపోయింది. దర్యాప్తు చేసి ఆమెకు న్యాయం చేయాలని ఎస్ఐ రమేష్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో యర్రంశెట్టి శ్రీనివాసరావు, ఎఎంసి ఛైర్మన్ కోటిపల్లి బాబు, వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ గొలగాని సత్యనారాయణ, ఎఎంసి డైరెక్టర్ మతల కాశీ, అండలూరు సొసైటీ అధ్యక్షులు మానుకొండ ప్రదీప్ పాల్గొన్నారు.

బాలేపల్లిలో సీసీ రోడ్లను ప్రారంభిస్తున్న ఎంఎల్‌ఎ గ్రంధి

15 ఏళ్ల తర్వాత పంట కాలువ ప్రక్షాళన

ప్రజాశక్తి - కాళ్ల

పెదఅమిరం గ్రామంలో నారాయణకోడు పంట కాలువ ప్రక్షాళన పనులు యుద్ధ ప్రాతిపదికన చేపడుతున్నామని గ్రామ సర్పంచి డొక్కు సోమేశ్వరరావు శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచి డొక్కు సోమేశ్వరరావు మాట్లాడుతూ పంట కాలువ పూడుకుపోయిందని, రింగు బండ ఎగువ, దిగువ ప్రాంతాల ఇళ్ల వాడకపు నీరు వెళ్లేందుకు పంట కాలువలోకి తూరలు ఏర్పాటు చేశారని తెలిపారు. పంట కాలువ పూడుకుపోవడంతో సాగు, తాగునీరు పెదఅమిరం గ్రామానికి అందడం లేదన్నారు. ప్రక్షాళన పనులు 15 ఏళ్ల తర్వాత చేపడుతున్నామన్నారు. ఈ కాలువకు అనుకుని వెయ్యి ఎకరాలు సాగవుతోందని తెలిపారు. గ్రామస్తులకు తాగునీరు నిమిత్తం ప్రధాన నరసయ్య మంచి చెరువు ఉందని, ఈ పంట కాలువలో పూడికతీత తీసి మట్టిని ట్రాక్టర్ ద్వారా తరలిస్తున్నామని తెలిపారు. సుమారు లక్షల 50 వేల రూపాయలతో పంచాయతీ నిధులతో పనులు చేపడుతున్నామన్నారు. ప్రజలందరికీ తాగునీరు అందించాలనే సంకల్పంతో పంట కాలువలోకి ఏర్పాటు చేసిన మురుగునీటి తూరలను తొలగించేందుకు నోటీసులు ఇస్తున్నామన్నారు. ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా పంటకాలువ పనులు చేస్తున్నట్లు తెలిపారు. ఇంకా ఈ పనులు నాలుగు రోజులపాటు కొనసాగుతాయన్నారు.

పెదఅమిరంలో చేపడుతున్న నారాయణ కోడు పంట కాలువ ప్రక్షాళన పనులు



27వ వార్డులో శంకుస్థాపన చేసిన కవురు శ్రీనివాస్

అభివృద్ధి పనులకు ఎంఎల్‌సి శ్రీనివాస్ శంకుస్థాపన

ప్రజాశక్తి - పాలకొల్లు

పట్టణంలో పలు వార్డుల్లో ఎంఎల్‌సి కవురు శ్రీనివాస్ శుక్రవారం పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. 22వ వార్డులో రూ.18 లక్షల నిధులతో సీసీ రోడ్డు, డ్రెయినేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. 27వ వార్డులో రూ.26.60 లక్షలతో సీసీ రోడ్డు, డ్రెయినేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అలాగే ఒకటో వార్డు బ్రాడీపేట 2వ వీధిలో రూ.7.60 లక్షలతో సీసీ రోడ్డు, డ్రెయినేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. 3వ వార్డులో నూతనంగా నిర్మిస్తున్న మెటల్ రోడ్డు పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మాజీ డిసిఎంఎస్ ఛైర్మన్ యడ్ల తాతాజీ, పట్టణ అధ్యక్షులు చందక సత్తిబాబు, వెంకటేశ్వరరావు, మామిడి బాబు పాల్గొన్నారు.

త్యాగాల ఫలితమే ఎస్‌టియు

రాష్ట్ర అధ్యక్షులు సాయి శ్రీనివాస్

ప్రజాశక్తి - భీమవరం

ఎంతోమంది నాయకుల త్యాగాల ఫలితంగానే ఎస్‌టియు ఏర్పడిందని వారి అడుగుజాడల్లో నడిచి ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని ఎస్‌టియు రాష్ట్ర అధ్యక్షులు ఎల్.సాయి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. స్థానిక ఎస్‌టియు కార్యాలయంలో సంఘం 7వ ఆవిర్భావ దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జెండాను పిఎస్ ప్రతాప్‌రాజు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సాయి శ్రీనివాస్ ఎస్‌టియు ఆవిర్భావం నుంచి ఇప్పటివరకూ సాధించిన ముఖ్యాంశాలు, సంఘం నిర్మాణానికి జరిగిన కృషిని హాజరైన సభ్యులకు వివరించి మాట్లాడారు. ఎస్‌టియు ఉజ్వల స్థితిలో ఉందంటే దానికి ఎంతోమంది నాయకుల త్యాగమే కారణమన్నారు. వారి అడుగుజాడల్లో నడిచి, వారి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు గుత్తుల శ్రీనివాస్ ఉపాధ్యాయుల బదిలీల్లో ఎస్‌టియు చేసిన కృషి వల్ల ఎంతోమంది ఉపాధ్యాయులు లబ్ధి పొందాలన్నారు. మహిళా ఉపాధ్యక్షులు బాల కుమారి మాట్లాడుతూ సంఘ పటిష్టానికి మండల కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. ఎస్‌టియు జిల్లా అధ్యక్షులు జవహర్లాల్ రాజు మాట్లాడుతూ గత పిఆర్‌సి బకాయిలు, డిఎ లను తక్షణం చెల్లించాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కెవి.రామచంద్రరావు మాట్లాడుతూ ఎన్నికల ముందు వైసిపి ప్రభుత్వం ఇచ్చిన హామీలను తక్షణం అమలు చేయాలని డిమాండ్ చేశారు. సిపిఎస్ రద్దు చేయడంతో పాటు డిఎలను సకాలంలో అందించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టియు సీనియర్ నాయకులు ప్రతాప్‌రాజు, ఆర్థిక కార్యదర్శి వి.జనార్ధనరావు, జిల్లా కార్యదర్శి సాయి వర్మ, నాయకులు బి.పాండు రంగారావు, జోసఫ్ రాజు, మహంకాళి, శ్రీనివాసరావు, చుండూరి ప్రసాద్, ఉదయ్ శంకర్, సురేష్, వాసు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎస్‌టియు రాష్ట్ర అధ్యక్షులు సాయి శ్రీనివాస్

నేడు విద్యార్థులకు బహుమతులు అందజేత

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

నరసాపురం ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న ఉచిత వేసవి విజ్ఞాన శిక్షణా తరగతుల సందర్భంగా శుక్రవారం పిల్లలతో పుస్తక పఠనం, పత్రికా పఠనం చేయించారు. అనంతరం సోషల్ క్లాస్ సలాది రామారావు ఎక్స్ మిలటరీ సర్వీస్ చిత్రలేఖనం, యోగా క్లాసులు, డాన్స్ క్లాసులు, వక్తృత్వం, పుస్తక సమీక్ష, పద్యాలు, పాటలు, క్రాఫ్ట్ క్యారమ్స్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త సుబ్బారావు, జి.శ్రీనివాస్, సిహెచ్.శ్రీనివాస్, సూర్యం బాబు, ప్రిన్స్ ప్రవీణ్ పాల్గొన్నారు. విజేతలకు ఈనెల పదో తేదీ సాయంత్రం అల్లూరి సంస్కృతిక కేంద్రంలో జరుగు ముగింపు సభలో పెద్దల చేతుల మీదుగా బహుమతులు అందించనున్నట్లు తెలిపారు.

భవన నిర్మాణ కార్మికులకు తువ్వాళ్లు పంపిణీ

ప్రజాశక్తి - పాలకొల్లు

రోటరీ క్లబ్ ఆఫ్ పాలకొల్లు ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికులు 30 మందికి శుక్రవారం టవల్స్ పంపిణీ చేశారు. రోటరీ క్లబ్ భవనానికి స్లాబ్ నిర్మించారు. ఈ పనిలో పాల్గొన్న కార్మికులకు నెత్తిపై బరువులు మోయడానికి ఖాళీ సిమెంట్ సంచులను తలపాగా చుట్టుకుని పనిచేయడం గమనించిన రోటరీ సభ్యులు వెంటనే కార్మికులందరికీ టవల్స్ పంపిణీ చేయడానికి శ్రీకారం చుట్టి అందజేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ ప్రెసిడెంట్ ముత్యాల శ్రీనివాస్, పాస్ట్ ప్రెసిడెంట్లు మద్దాల రాంప్రసాద్, మద్దాల వాసు, కటారి నాగేంద్ర, సభ్యులు పాల్గొన్నారు.

కార్మికులకు తువ్వాళ్లు పంపిణీ చేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

మాట్లాడుతున్న ఎంపిడిఒ బాబ్జిరాజు

గ్రామాల్లో సమస్యల్లేకుండా చూడాలి

ప్రజాశక్తి - మొగల్తూరు

గ్రామస్తులకు ఎటువంటి సమస్యలు లేకుండా చూడాలని ఎంపిడిఒ ఉండ్రు బాబ్జి రాజు సూచించారు. మొగల్తూరులోని మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శులకు, సచివాలయ సిబ్బందికి నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపర్చాలన్నారు. తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి మేడిది నవీన్‌కిరణ్, వ్యవసాయ శాఖ అధికారి అబ్దుల్ రహీం పాల్గొన్నారు.

దుకాణాల్లో తనిఖీలు

ఇద్దరు చిన్నారుల గుర్తింపు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

పట్టణంలో పలు దుకాణాల్లో శుక్రవారం బాల కార్మిక శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో భాగంగా షాపుల్లో పనిచేస్తున్న ఇద్దరు చిన్నారులను అధికారులు గుర్తించారు. సంబంధిత యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తాడేపల్లిగూడెం సహాయ కార్మిక అధికారి కె.గోపీకుమార్ తెలిపారు. ఈ తనిఖీల్లో తాడేపల్లిగూడెం, తణుకుకు చెందిన కార్మిక సహాయ అధికారులు పట్టణ ఎస్ఐ జిజె.ప్రసాద్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ దుర్గాభవాని పాల్గొన్నారు.

సిఐటియు ఆధ్వర్యాన స్టడీ సర్కిల్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

తాడేపల్లిగూడెం సిఐటియు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో కార్మికులు, లౌకికతత్వం, హిందూత్వ, రాజకీయాలు అనే అంశంపై శుక్రవారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో జవ్వాది శ్రీను అధ్యక్షతన స్టడీ సర్కిల్ నిర్వహించారు. ఈ సమావేశానికి సిఐటియు జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు పాల్గొని మాట్లాడారు. ఆర్‌ఎస్‌ఎస్ బిజెపి కూటమి తామే అందరికన్నా గొప్ప దేశభక్తులమని ప్రచారం చేస్తూ, తమను విమర్శించిన వారంతా దేశద్రోహులని ఎదురు దాడి చేస్తున్నారని తెలిపారు. మత ప్రమేయం లేని రాజకీయాలు దేశానికి అవసరమని తెలిపారు. మానవులు ఆచరణ ద్వారా తమ సమస్యలకు తామే పరిష్కారాలు కనుగొంటారని తెలిపారు. కరోనాను ఎదుర్కొనే వ్యాక్సిన్‌ను మానవులే కనుగొన్నారన్నారు. కార్మికుల మతవిశ్వాసాలను బట్టి కార్మికులను చీల్చి కార్మికోద్యమాన్ని బలహీన పరచడానికి రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. అసంఘటిత రంగ కార్మికులకు ఇఎస్ఐ, పిఎఫ్, ఇన్సూరెన్స్ వంటివి అమలు జరపడం లేదని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెట్టుబడిదారులకు, కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తున్నాయన్నారు. సంఘటిత రంగంలో అమలు జరిగే సదుపాయాలు అసంఘటిత రంగంలో అమలు జరపడానికై పెద్ద ఎత్తున పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కరెడ్ల రామకృష్ణ, జవ్వాది శ్రీను, శిద్దిరెడ్డి శేషబాబు, నరమాల కృష్ణ, పోతు శ్రీను, పతివాడ నాగేంద్రబాబు పాల్గొన్నారు.

11న టిడిపి మండల స్థాయి సమావేశం

ప్రజాశక్తి - పెనుమంట్ర

వెలగలవారిపాలెంలో ఈ నెల 11వ తేదీన మండల విస్తృత స్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు టిడిపి మండల అధ్యక్షుడు తమనంపూడి శ్రీనివాసరెడ్డి (బుల్లాలు) శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మాజీ మంత్రి పితాని సత్యనారాయణ హాజరౌతారని తెలిపారు. మండల కమిటీ క్లస్టర్, ఇన్‌ఛార్జులు, యూనిట్ ఇన్‌ఛార్జులు, బూత్ కన్వీనర్లు, మండల అనుబంధ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు, గ్రామకమిటీల అధ్యక్షులు, కార్యదర్శులు తప్పని సరిగా హాజరు కావాలని పిలుపునిచ్చారు.

3 రోజుల్లో 70 టన్నుల విత్తనాలు విక్రయం

ప్రజాశక్తి - పెనుమంట్ర

గత సంవత్సరం స్వర్ణకు ప్రత్యామ్నాయంగా విడుదలైన ఎంటియు 1118 రకం విత్తనాలను మూడు రోజుల్లో 1500 మంది రైతులు సుమారు 70 టన్నులు కొనుగోలు చేసినట్లు మార్టేరు వ్యవసాయ పరిశోధన సంస్థ ఎడిఆర్ డాక్టర్ ఎం.భరత లక్ష్మి అన్నారు. శుక్రవారంతో విత్తనాల విక్రయాలు ముగిశాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాబోయే కాలంలో పరిశోధన సంస్థలో ఎంటియు 1271, ఎంటియు 1282 రకాలు విడుదలకు సిద్ధంగా ఉన్నాయన్నారు. అదేవిధంగా ఎంటియు 1262 రకం 400 బ్యాగులు, ఎంటియు 3626 రాకం 350 బ్యాగులు, పిఎల్‌ఎ 1100 రకం 400 బ్యాగులు, ఎంటియు 1273 రకం 61 బ్యాగులు, ఎంటియు 1121 రకం 100 బ్యాగులు, ఎంటియు 1293 రకం 66 బ్యాగులు, ఎంటియు 1224 రకం బ్యాగులు ఆయా రకాలు అమ్మగా మిగిలి ఉన్నాయని తెలిపారు. ఆసక్తి గల రైతులు తమను సంప్రదించాలని సూచించారు.

డిఎన్‌ఆర్‌లో జాబ్‌మేళా

ఉద్యోగాలకు 202 మంది ఎంపిక

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు డిఎన్‌ఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఎపి నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం జాబ్ మేళా నిర్వహించారు. ఈ జాబ్ మేళాలో 12 కంపెనీలు పాల్గొన్నాయని 441 మంది అభ్యర్థులు హాజరవ్వగా 202 మంది వివిధ కంపెనీలకు ఎంపికయ్యారని ఎడిఎస్‌డిఒ.ఆంజనేయులు, జిల్లా ఉపాధి అధికారి మధుభూషణ్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ శోభారాణి మాట్లాడుతూ అభ్యర్థులు ఏ ప్రాంతంలోనైనా ఉద్యోగం చేయగలిగే ఆత్మస్థైర్యాన్ని కలిగి ఉండాలన్నారు. వైస్ ప్రిన్సిపల్ రవిశంకర్ మాట్లాడుతూ ప్రయివేటు రంగంలో కూడా మెరుగైన ఉపాధి అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఎల్ఐసి మేనేజర్ రఘు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో కూడా ఎల్ఐసి సేవలు విస్తరించాయని, నిరుద్యోగులు తామున్న ప్రాంతాల్లోనే ఉద్యోగం చేసుకునే అవకాశం ఉందని తెలిపారు.

పబ్లిక్ నోటీసు

నా క్లయింటు **అడపా బాలకృష్ణ గారి భార్య సౌభాగ్యలక్ష్మి,** 3rd Ward, త్రినాధ వీధి, తాడేపల్లిగూడెం, ప॥గో॥జిల్లా - నా క్లయింటుకు సంబంధించి పబ్లిక్ నోటీసు జారీ చేయబడినది.

నా క్లయింటు అడపా సౌభాగ్యలక్ష్మి ఈక్రింది షెడ్యూలు క్రయ దస్తావేజు కంచుమర్తి వెంకట్రావు, S/o. రమణ గార్ల ద్వారా ది. 05-01-1966 తేదీన తాడేపల్లిగూడెం రిజిష్టరు వారి వద్ద క్రయం పొందిన డాక్యుమెంటు నెం. 21/1966. నా భర్త అయిన అడపా బాలకృష్ణ గారితో కలిసి ది. 20-5-2023వ తేదీన బండిపై జిరాక్స్ నిమిత్తం వెళుతుండగా మార్గం మధ్యలో పడిపోయినది. ఆ డాక్యుమెంటు ఎవరికైనా దొరికినను లేక ఎటువంటి అభ్యంతరములు ఉన్ననూ ఈ ప్రకటన ఇచ్చిన ఐదు రోజులలోపు ఈక్రింది అడ్రసుకు తెలియజేయగలరు.

షెడ్యూలు హద్దులు

ప॥గో॥జిల్లా, తాడేపల్లిగూడెం రిజిష్టర్, తాడేపల్లిగూడెం మున్సిపాలిటీ, రి.స. నెం. 641, 1/3వ వంతు వాటా అనగా చ॥గ॥ 75.2/3లు ఖాళీ నివేశన స్థలమునకు హద్దులు.

తూర్పు: యీలి పాపయమ్మ గారి స్థలం.
పడమర: అద్దాల సూరన్న గారి స్థలం.
ఉత్తరం: మారిశెట్టి రత్నం గారి ప్రహారీ.
దక్షిణం: వీరాబత్తుల సీత గారి స్థలం.

పమ్మి వి.నాగ వీరభద్రుడు
అడ్వకేట్, తాడేపల్లిగూడెం
ప॥గో॥జిల్లా, సెల్: 7702311197

PUBLIC NOTICE

Under the instructions of my client **ADAPA SOUBHAGYA LAKSHMI,** W/o. Balakrishna, H.No. 1-1-100, 3rd Ward, Trinadha Street, Tadepalligudem, W.G.Dt.

That my client had purchased the below schedule property (75. 2/3) under a Regd. Sale Deed No. 21/1966 from Kanchumarthi Venkata Rao in turn the said Kancumarthi Venkata Rao had purchased the schedule mentioned property under a Regd. Sale Deed No. 21/1966. Which is the Link Document to my client's property that the Original Link Document No. 21/1966 was lost as it was dropped some where on the road during his travel on bike from house to xerox center, Tadepalligudem Local area 20-05-2023. Some was not found after the retured to home. There are this public notice is issued to all that any-body has costady of the said lost original link document No. 21/1966 (or) has claim right or objection over the below schedule property. They shall come forward with documentary proof within five (5) days from the date of this notice to the undersigned else it shall be deemed that there are not claims (or) objections over the below schedule property and the transaction will be proceeded with the claims/ objections received after the above said time, shall not be taken in to consideration and will not bind over my client's right over the below mentioned schedule property.

SCHEDULE

Site measuring an extent of 75. 2/3 s.y together with RCC House D.No. 1-1-100, R.S. No. 641, 3rd Ward, Trinadha Street, Tadepalligudem.
EAST: Site of Eeli Papayamma.
SOUTH: Site of Veerabathula Sitha.
WEST: Site of Addala Suranna.
NORTH: Site of Marisetti Ratnam.

PAMMI V.NAGA VEERABHADRUDU
Advocate, Tadepalligudem
W.G.Dt., Cell: 7702311197